క్లుప్తంగా

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం



జగదీష్ గుప్తాను సన్మానించిన రోటరీ సభ్యులు

గుంతకల్లుటౌన్: గ్రామీణ వ్యాపార అభివృద్ధిలో జాతీయస్థాయి ఎఫ్ఏపీసీసీఐ అవార్డును అందుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త సత్రసాల జగదీష్ గుప్తాను రోటరీక్లబ్ ఘనంగా సన్మానించింది. మంగళవారం రాత్రి రోటరీ శతాబ్ది ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త జగదీష్ గుప్తా సేవలను వారు కొనియాడారు. కాగా రోటరీస్కూల్ ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠకు జగదీష్ గుప్త రూ.1 లక్ష విరాళాన్ని ప్రకటించినట్లు రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్‌కార్వా, రవి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్లు సత్రసాల సురేష్‌గుప్త, వీఎల్. గుప్త, మంజుల వాణి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి సహకరించండి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ నాయకులు కోరారు. బుధవారం విజయవాడలో మంత్రిని స్థానిక బీజేపీ సీనియర్ నాయకులు హరిహరనాథ్, పురంధర్ కలిసి సమస్యలను తెలియజేశారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి



తిలక్, ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో బుధవారం జాతీయ నాయకులు బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు అబూ బకర్, అదనపు కార్యదర్శి కుళ్లాయప్పలు సభ్యులతో కలిసి తిలక్, ఆజాద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిలక్, ఆజాద్ గొప్పతనాన్ని గురించి, వారు దేశానికి చేసిన సేవలు గురించి వివరించారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్

గుత్తి: పట్టణంలోని పలు కళాశాలలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో బుధవారం పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించాలో తెలియజేశారు. ఎస్పీ జగదీష్ సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై మాట్లాడిన వీడియోను ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రదర్శించారు.

చంద్రబాబువి నీచ రాజకీయాలు



మాట్లాడుతున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రిటౌన్: ఎన్నికల హామీలను నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ చంద్రబాబు నాయుడు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌ భాషా ధ్వజమెత్తారు. తాడిపత్రిలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డిని రాజకీయ దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయించిందన్నారు. తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపి ప్రభుత్వం శునకానందం పొందుతోందన్నారు. పాలన మరిచి ప్రతిపక్షం గొంతునొక్కే ప్రయత్నం చేస్తే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. లిక్కర్ స్కాం అనేది పూర్తిగా చంద్రబాబు కల్పితమని, ఇందులో అరెస్ట్ అయిన మిథున్‌రెడ్డితోపాటు మిగిలిన వారు కూడా కడిగిన ముత్యంలా బయటకు రావడం ఖాయమన్నారు.

రోడ్లు ధ్వంసం..ఒళ్లు హూనం!



రోడ్డును ధ్వంసం చేయడంతో తిమ్మనచెర్ల పోస్టాఫీసు మార్గంలో నిలిచిన వర్షపు నీరు



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో ధ్వంసం చేసిన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గుంతకల్లుటౌన్: పట్టణంలో తాగునీటి పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం ప్రధాన వీధుల్లో ధ్వంసం చేసిన రోడ్లు నేడు అధ్వానంగా మారాయి. సరిగ్గా సీసీ రోడ్ల మధ్యలో పైప్‌లైన్ కోసం కిలోమీటర్ల మేర తవ్వన గుంతలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. దీంతో రోడ్డు అడుగవేయాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ధ్వంసం చేసిన రోడ్లను బాగు చేయండి మహాప్రభో అని ఆయా వార్డుల కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో గగ్గోలు పెట్టినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై మున్సిపల్ ఈఈ మున్సిపల్ ఈఈ ఇంతియాజ్‌ను వివరణ కోరగా తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం గుంతబావి వీధి, పోలీస్‌స్టేషన్ గల్లీలో రోడ్డు ప్యాచ్ వర్క్‌ను చేసేందుకు టెండర్లు పిలిచామన్నారు. ఈ ప్రక్రియ ముగిశాక ప్యాచ్ వర్క్‌లు చేయిస్తామని తెలిపారు. హనుమేష్‌నగర్, మండీబజార్ మిగిలిన ఏరియాల్లో అంచనాలు తయారు చేయించి ప్యాచ్ వర్క్‌లు చేయిస్తామని చెప్పుకొచ్చారు. అమృత్ స్కీము కింద గతంలో తవ్విన రోడ్లు తమ పరిధిలో లేవని, ఆ పనులు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సి ఉందని తెలియజేశారు.



హనుమేష్‌నగర్‌లో మరమ్మతులకు నోచుకోని రోడ్డు



మార్కెట్-కేపీఎస్ థియేటర్ వద్ద కల్వర్టు, రోడ్డు పగిలిపోయిన దృశ్యం



అల్లీపీరా కాలనీ ఆర్చ్ వద్ద నిలిచిన వర్షపునీరు

ఇంటింటా చెత్త సేకరణ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్

గుత్తి రూరల్: గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ తప్పకుండా చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. చెత్త నుంచి ఎరువు తయారు చేసి గ్రామాల్లోని రైతులకు తక్కువ ధరలకు ఇవ్వాలన్నారు. తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. సంపద తయారు కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. పింఛన్ల పంపిణీ, పీ4 సర్వేతో పాటుగా అన్ని సర్వేలను వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కు సంబంధించి సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటేష్, బాష, పవన్‌గౌడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు నాణ్యతగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఏపీడీ పుల్లారెడ్డి

పెద్దవడుగూరు: ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేపట్టాలని డ్వామా ఏపీడీ పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి అనుకూలంగా ఉండే పనులు చేపట్టాలన్నారు. పనులు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. కూలీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: ఉపాధి హామీ ప్రగతి లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీఓ కరుణ సాగర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పనులు చేయించాలన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద రైతులకు పండ్ల మొక్కలను అందించాలన్నారు. ఏపీఓ ఓబిరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్ఎంయూఏ డిపో అధ్యక్ష, కార్యదర్శులుగా మహేశ్వర్, బాబు

తాడిపత్రి రూరల్: ఎస్ఎంయూఏ ఆర్టీసీ డిపో అధ్యక్ష, కార్యదర్శులుగా మహేశ్వర, బాబు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భాస్కర్‌నాయుడు, రీజనల్ సెక్రటరీ ప్రతాప్‌నారాయణల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అనంతరం వారిని తోటి కార్మికులు పూలమాలలతో సత్కరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి టౌన్: చిన్నపొలమడ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. నిందితుల నుంచి చేసి రూ.19, 500 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రిరూరల్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. దాదాపు 40 ఏళ్లున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి జేబులో చెన్నై సెంట్రల్ నుంచి కడపకు వెళ్లేందుకు తీసుకున్న జనరల్ టికెట్ ఉందన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాల అందజేత

తాడిపత్రిటౌన్: సజ్జలదిన్నె, బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో టెన్త్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బుధవారం తాడిపత్రి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. సజ్జలదిన్నె పాఠశాల విద్యార్థి ఇన్షియామున్కాన్‌కు రూ.5 వేలు, మహాజికి రూ.3 వేలు, రేవతికి రూ.2వేలు. బ్రాహ్మణపల్లి విద్యార్థి ధీరజ్‌కుమార్‌కు రూ.5వేలు, లక్ష్మీకి రూ.3 వేలు, ఆకాష్‌కు రూ.2 వేలు అందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు లక్ష్మి, నరసింహులు, పెన్షనర్ల సంఘం నాయకులు సత్యప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణస్వామి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణకు నిధుల మంజూరు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని పేట ఉమామహేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణకు నిధులు మంజూరైనట్లు ఆలయ కమిటీ సభ్యులు గంగరాజు, నాగిరెడ్డి, చౌడేశ్వరయ్య, సుబ్బయ్య బుధవారం తెలిపారు. దేవదాయ శాఖ సర్వశ్రేయోనిధి కార్యక్రమం కింద రూ.96 లక్షలు మంజూరు చేసిందన్నారు.

దళితులకు ఇచ్చిన భూమి వారికే దక్కాలి

గార్లదిన్నె: ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమి వారికే దక్కాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. బుధవారం ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పెనకచెర్ల గ్రామానికి చెందిన వన్నూరప్పకు ప్రభుత్వం 1987లో సర్వే నంబర్ 580 -4లో 5-40 ఎకరాలు భూమి పంపిణీ చేశారన్నారు. అయితే వన్నూరప్ప అదే గ్రామానికి చెందిన సూర్య చంద్రారెడ్డి ఇంటిలో జీతం చేస్తూ అప్పు చేశాడన్నారు. అప్పు చెల్లించకపోవడంతో భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. సూర్యచంద్రారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అసైన్‌మెంట్ కింద దాదాపు 16 ఎకరాలు భూమి డీ- పట్టా ఇవ్వగా, మరి కొంత భూమి అక్రమణ చేసుకొని చీనీ చెట్లు సాగు చేశారన్నారు. సీలింగ్ యాక్టు ప్రకారం సర్వే చేసి మిగిలిన భూమిని దళితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

యాడికి: యాడికి మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు ఎంపీడీఓ వీర్రాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పనులు చేయకున్నా నాయకులు బిల్లులు చేయించుకోవడం చాలా దారుణమని సీపీఐ నేతలు మండిపడ్డారు. పార్టీ మండల సహాయ కార్యదర్శి వడ్డే రాముడు, చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సీనియర్ నేతలు శివన్న, నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీసమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. అషాఢ మాసాన్ని పురస్కరించుకొని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శాకాంబరీదేవి దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శనం చేసుకున్నారు.

వదంతుల కలకలం

గార్లదిన్నె: ఓ యువకుడిని చంపి మూటకట్టి కమలాపురం క్రాస్ సమీపంలో హెచ్చెల్సీ బ్రిడ్జి వద్ద జమ్ములో పడేశారని, మంగళవారం రాత్రి ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహం తీసుకెళ్లినట్లు వదంతులు కలకలం రేపాయి. దీంతో బుధవారం పోలీసులు పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టడంతోపాటు స్థానికులకు విచారించారు. అయితే ఎలాంటి ఆధారాలు, సమాచారం లభించకపోవడంతో మిన్నకుండిపోయినట్లు సమాచారం.

అబద్ధపు హామీల సీఎం చంద్రబాబు



పి.పసులూరులో ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి , వాటిని అమలు చేయకుండా అబద్ధపు హామీల సీఎంగా చంద్రబాబునాయుడు నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గువ్వల శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పి. కొత్తపల్లి, పసులూరు గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలను ఏడాది గడిచినా అమలు చేయలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద 19 ఏళ్లు దాటిని మహిళలందరికీ రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చి మోసగించారన్నారు. కూటమి ప్రభుత్వంలోని మంత్రులే హామీ అమలు చేయలేమని ప్రకటించడం వారి దిగుజారుడు తనానికి నిదర్శమన్నారు. జెడ్పీటీసీ భాస్కర్, నాయకులు చికెన్ నారాయణ స్వామి, నరేష్, బయపరెడ్డి, నిమ్మల భాస్కర్, చినప రెడ్డి, లక్ష్మీనారాయణ, రంగా, వరికూటి కాటమయ్య, శివారెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు, లక్ష్ముంపల్లి గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయలేక ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వం పని తీరును గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ పరామర్శ



ఎద్దులపల్లిలో ఆనంద్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్



కట్టకిందపల్లిలో శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న నైరుతిరెడ్డి

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నీలం అశ్వర్థరెడ్డి, గోపాల్‌రెడ్డి తనయుడు రామ్మోహన్‌రెడ్డి, కాలు ఫాక్చర్‌తో బాధపడుతున్న ఆనందరెడ్డిని బుధవారం మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డి పరామర్శించారు. అనంతరం కట్టకిందపల్లికి వెళ్లి బైకు రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ నేత శ్రీనివాస్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. వారి వెంట పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, సీనియర్ నాయకులు చుక్కలూరు రామకృష్ణారెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, రామిరెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరువు



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనారాయణ

గార్లదిన్నె: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యలు ఏకరవు పెట్టారు. కో ఆప్షన్ మెంబర్ బాబా యూనస్ మాట్లాడుతూ కల్లూరు జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే దారిని రైల్వే అధికారులు మూసేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎం. కొత్తూరులో ప్రభుత్వ పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉన్నాయని ,ప్రస్తుతం విద్యార్థులు సంఖ్య పెరిగిందని, సరిపడా గదులు లేకపోవడంతో ఉపాధ్యాయులు చెట్ల కింద విద్యార్థులకు విద్య బోధిస్తున్నారని సర్పంచు తెలియజేశారు. సంజీవపురంలో ట్రాన్స్‌ఫార్మర్ లేక నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అంగన్‌వాడీ పాఠశాలకు సొంత భవనం లేదని, ఎంపీటీసీ సభ్యుడు విశ్వనాథ్ సభ దృష్టికి తెచ్చారు. గార్లదిన్నెలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలి

యాడికి/ పెద్దపప్పూరు/ పామిడి : ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ బుధవారం యాడికి మండలం రాయలచెరువు, తూట్రాళ్ల పల్లి ఉన్నత పాఠశాల, పెద్దపొలమడ, పెద్దపప్పూరు జూనియర్ కళాశాల, కేజీబీవీ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పోస్టుకార్డు పంపారు. ఇక పామిడిలో ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో పదో రోజూ రిలేదీక్షలు కొనసాగించారు. సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంక రాజుకాలువ వెంకటేష్, రాజ్‌కుమార్, కేశవ, సుధీర్, సుదర్శన్, ఓబుళపతి, రాజేష్, నాగశేఖర్ ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

పుట్లూరు: మండలంలోని బాలాపురం, మడ్డిపల్లి రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ కాత్యాయని దరఖాస్తు ఎలా చేయాలో వివరించారు. వ్యవసాయ సిబ్బంది సుధాకర్‌రెడ్డి, ఎంపీఈఓ నూరి, నాగలింగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు సమాచార హక్కు చట్టం పై ఏఓ మునికృష్ణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పని తీరును , పారదర్శకత, అధికారుల జవాబుదారీ తనం గురించి తెలుసుకోవడానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఏఓఈ సునీత, విహెచ్ఏ లు, వీఏఓ లు , రైతులు పాల్గొన్నారు.

మద్యం షాపుల తనిఖీ

గుంతకల్లు: పట్టణంలోని మద్యం షాపులను బుధవారం ఎక్సైజ్ సీఐ శివసాగర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 12 మద్యం షాపుల్లో స్టాక్‌లో వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయా? కాలం చెల్లిన మద్యం ఏమైనా అమ్ముతున్నారా తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయాలను పాటించాలన్నారు. ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రోన్లను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏఓ లీనా వసుంధర

గుంతకల్లు రూరల్: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న డ్రోన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ లీనా వసుంధర సూచించారు. బుధవారం సంగాల, దోసలుడుకి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో డ్రోన్‌లను అందజేస్తోందని, రూ.9.8 లక్షల ధర కలిగిన డ్రోన్ పొందడానికి రైతులు తమవంతు వాటాగా రూ.1.96 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఐదు మంది రైతులు గ్రూపుగా ఏర్పడి ఒకరిని పైలెట్‌గా ఎంపిక చేసుకోవాలని, పైలెట్ రైతు ఇంటర్ చదివి ఉండాలని తెలియజేశారు. అనంతరం రెండు గ్రామాల్లోనూ సాగుచేసిన పూలతోటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: జక్కలచెరువు గ్రామ సచివాలయం నుంచి బదిలీ అయిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు. బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన సిబ్బందిని కార్యదర్శి వెంకటేష్, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇసురాళ్లపల్లి సర్పంచ్ వాసుదేవ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజన్న, మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రతాప్, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పామిడి సమావేశం సక్సెస్‌పై కృతజ్ఞతలు

పామిడి: పట్టణంలో గత మంగళవారం నిర్వహించిన ‘రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో-సీఎం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ’ పై మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశం విజయవంతంపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డి బుధవారం హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు, మేధావులు, అభిమానులు, ప్రజలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పామిడి మండలంలో త్వరలో నిర్వహించే ఇంటింటికీ వంచన కార్యక్రమాన్ని రెట్టింపు ఉత్సాహంతో చేపడదామని పిలుపునిచ్చారు.

మహిళలకూ సీఎం చంద్రబాబు వెన్నుపోటు



మాట్లాడుతున్న రేవతి

తాడిపత్రిటౌన్: ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు మహిళలకూ వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ తాడిపత్రి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రేవతి విమర్శించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి కింద ఇస్తామని చెప్పి మోసగించడం దారుణమన్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలనడం ఏరుదాటాక తెప్ప తగలేసినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ఏడాది ముందు నుంచే ఇంటింటికి తిరిగి బాండ్లు రాసిచ్చి సూపర్‌సిక్స్ పథకాలు పేరుతో రాష్ట్ర ప్రజలను ఊరించారన్నారు. అన్ని క్యాలిక్యులేషన్‌లతో ఎంత ఖర్చు అవుతుందో తెలుసుకునే సూపర్‌సిక్స్ పథకాలపై మాట ఇస్తున్నామని, వాటిని అమలు చేయకపోతే కాలర్ పట్టుకోవాలని మంత్రి లోకేష్ అప్పట్లో చెప్పారని ఇప్పుడు ఎవరి కాలర్ పట్టుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు.

క్రికెట్ విజేత ‘శ్రీవాణి’ స్కూల్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించిన ఆర్‌డీటీ మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ టోర్నీలో శ్రీవాణి అప్పర్ ప్రైమరీ స్కూల్ విజయం సాధించింది. మౌర్య, శ్రీవాణి స్కూల్ జట్ల మధ్య ఫైనల్ పోటీ జరిగింది. ఇందులో 64 పరుగుల తేడాతో శ్రీవాణి స్కూల్ జట్టు గెలుపొందినట్లు పాఠశాల కరస్పాడెంట్ నీలకంఠ తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.